క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్: 2024–25 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు) అక్కన్నపేట, ప్రస్తుతం హుస్నాబాద్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డి.ఎస్ వెంకన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ సీట్లకు గిరిజన, గిరిజనేతర బాలికల నుంచి కౌన్సిల్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అడ్మిషన్‌కు 10వ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ అందజేయాలన్నారు.

గిరిజన, గిరిజనేతర బాలికలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ఎస్టీ బాలికల గురుకుల విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ చేరేందుకు గిరిజన, గిరిజనేతర బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయ అధికారి డి.ఎస్ వెంకన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించినవారు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ అందజేయాలన్నారు. ప్రస్తుతం అక్కన్నపేట మండల ఎస్టీ బాలికల గురుకులం హుస్నాబాద్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో కొనసాగుతుందన్నారు. 82470 64625 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి భిక్షపతి శనివారం తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల బోధనతోపాటు కంప్యూటర్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ ల్యాబ్‌లు, లైబ్రరీ అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్, ప్రభుత్వ హాస్టల్ వసతి ఉన్నాయన్నారు. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 29వ తేదీలోగా రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రాధాన్యత ప్రకారం కళాశాలల వెబ్‌ఆప్షన్లు పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ముత్యాల తలంబ్రాల పంపిణీ


భక్తులకు తలంబ్రాలు అందిస్తున్న రామరాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): భద్రాచలం దేవస్థానం వారు గజ్వేల్‌లోని భక్త సమాజానికి వంద కిలోల ముత్యాల తలంబ్రాలు అందించారు. శనివారం మండల కేంద్రమైన శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో రామకోటి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు భక్తులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచల సీతారాముల కల్యాణానికి జగదేవ్‌పూర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 150 కిలోల గోటి తలంబ్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో వెంకటేశం, చంద్రశేఖర్, కొండల్, శంకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి కల్యాణానికి ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న యాదవ సంఘం నేతలు

ములుగు(గజ్వేల్): మండలంలోని కొట్యాల గ్రామంలో ఈనెల 20వ తేదీన జరిగే శ్రీమల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ శనివారం మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. స్వామివారి కల్యాణంతోపాటు గొల్ల కేతమ్మ, మేడాలమ్మ అమ్మవార్ల కల్యాణం కూడా జరుగుతుందని సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మండల చైర్మన్ అంజిరెడ్డి, యాదవ సంఘం మండల ఉపాధ్యక్షుడు బాబు, గ్రామ ఉపాధ్యక్షుడు పెద్దిరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాలేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో ఈనెల 23వ తేదీ నుంచి జూన్ 22 వరకు నిర్వహించే శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర పోస్టర్‌ను అధికారులు, పాలక వర్గ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. 23న రేణుకా ఎల్లమ్మ దేవి కల్యాణం, బండ్లు తిరుగుట కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతీ ఆది, మంగళ, శుక్రవారాల్లో అమ్మవారికి కుంకుమార్చన, ఒడి బియ్యం, బోనాల సమర్పణ, పట్నాలతో జాతర వైభవంగా జరుగుతుందన్నారు. నెల పాటు జరిగే జాతరలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కార్యనిర్వహణ అధికారి కిషన్‌రావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి కాశీ విశ్వనాథుడి ఉత్సవాలు

- మూడు రోజులపాటు నిర్వహణ
- శివపార్వతుల కల్యాణం, బండ్ల బోనాల ఊరేగింపు
- 20న స్వామివారి రథోత్సవం


కాశీవిశ్వనాథ స్వామి ఆలయం

దుబ్బాక: దుబ్బాకలోని లచ్చపేట మార్గంలో పురాతన కాశీవిశ్వనాథ స్వామి ఆలయం ఉంది. ఈ ప్రాంతంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్న కోరికతో స్వామివారి ఆలయాన్ని నిర్మించారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి పాడి పంటలతో ఈ ప్రాంతం కళకళలాడుతోంది. దీంతో ఏటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో బండ్ల బోనాల ప్రదక్షిణలు, స్వామివారి రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ.


కాశీవిశ్వనాథ స్వామి మూల విరాట్

ముఖ్యమైన కార్యక్రమాలు

19వ తేదీ ఉదయం సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, నవగ్రహారాధన, 8 గంటలకు రుద్రాభిషేకం, 11 గంటలకు రుద్రయాగం, 11.45 నిమిషాలకు శివపార్వతుల కల్యాణం, 5 గంటలకు బండ్ల బోనాల ప్రదక్షిణ, 6 గంటలకు వీరభద్రుడికి ఎదుర్కోలు, రాత్రి 10 గంటలకు వినోద కార్యక్రమాలు, ఒల్లు బండ ప్రదక్షిణలు, భద్రకాళి పూజలు నిర్వహిస్తారు.

20న రథోత్సవం



కాశీవిశ్వనాథ స్వామి రథాన్ని సోమవారం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించనున్నారు. ఏటా వైశాఖ పౌర్ణమికి మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఊరేగింపుగా వచ్చే స్వామివారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతారు. రథం ఆలయానికి చేరుకున్న తర్వాత ఉత్సవాలు ప్రారంభమవుతాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి


హుస్నాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాంగోపాల్ రెడ్డి


హుస్నాబాద్: రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిచి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతుందని, అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను..

హుస్నాబాద్: వర్షాలకు తడిచిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో సకాలంలో తూకం వేయకపోవడంవల్లే ధాన్యం తడిచిందన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

గజ్వేల్‌రూరల్: వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులకు న్యాయం చేయాలని డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్ మండలం జాలిగామ, బయ్యారం గ్రామాల్లో తడిచిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా శ్రీ కన్యకాపరమేశ్వరీ జయంతి


కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


దుబ్బాకలో వాసవీ కన్యకాపరమేశ్వరీకి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి ఉత్సవాలు జిల్లా కేంద్రంలో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి పతాకావిష్కరణ, అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘాల సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైశ్యభవన్ కమిటీ, వాసవీ క్లబ్, వనిత క్లబ్, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం సభ్యులు పుల్లూరి శోభారాణి, గట్టు రవి, కొమరవెల్లి బుచ్చయ్య, కూర శ్రీనివాస్, గంప కృష్ణమూర్తి, అయిత రత్నాకర్, పుల్లూరి శివకుమార్, మర్యాల వీరేశం, పుల్లూరి శ్రీనివాస్, మర్యాల వాణి, పుల్లూరి సుష్మ, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: దుబ్బాకలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీ కన్యకపరమేశ్వరి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా భజనలు చేశారు. కోలాటం ఆడారు. నగరసంకీర్తన నిర్వహించారు. ఉత్సవాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు చింత రాజు, నల్ల శ్రీనివాస్, కూర వేణు, పడకంటి రాజు, గంగం ధనుంజయ, మహిళలు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు అరుణ్ యాదవ్


వినతి పత్రం అందజేస్తున్న అరుణ్‌యాదవ్

ములుగు(గజ్వేల్): మండలంలో ప్రభుత్వ అనుమతులులేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేని లక్ష్మక్కపల్లి, తున్కిబొల్లారం రోడ్డులోగల పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత మెగా హెల్త్ క్యాంప్


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): యశోదా ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం సిద్దిపేట విద్యుత్ భవన్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ శనివారం నిర్వహించారు. క్యాంపును జిల్లా ఎస్‌ఈ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిబిరంలో ఉద్యోగులకు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారుగా 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనాథ్, మహేష్, ఏడీలు గంగాధర్, సంతోష్, యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సత్య సుదీష్, డాక్టర్ సోమేష్ మంజునాథ్, డాక్టర్ అమర్, వినయ్ కుమార్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాధిక, విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటింగ్ సరళిపై చర్చ


రఘునందన్‌రావును కలిసిన శ్రీనివాస్

ములుగు(గజ్వేల్): హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఆ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ శనివారం తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఓటింగ్ సరళిపై ఆయా మండలాల అధ్యక్షులతో రఘునందన్‌రావు చర్చించినట్లు చెప్పారు. మెదక్ ఎంపీ సీటును బీజేపీ గెలుచుకుంటుందని, మూడోసారి మోదీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



విత్తనాలను పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి నరేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): సబ్సిడీ జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందజేస్తున్నదని, తొలకరి వర్షాలు పడిన వెంటనే ఎకరానికి 12 కిలోల చొప్పున విత్తుకోవాలని సూచించారు. విత్తిన 25 నుంచి 30 రోజులకు జీలుగ పంట పూత దశకు వస్తుందని, నాటు వేసుకునే ముందు ఆపైరును నేలలో కలియదున్నాలన్నారు. పచ్చిరొట్ట పైరు వేసుకోవడం వల్ల భూసారం బాగా పెరుగుతుందన్నారు. జీలుగ విత్తనాల 30 కిలోల బస్తా సబ్సిడీపై రూ.1,116లకు అందజేస్తున్నట్లు తెలిపారు. కావల్సిన రైతులు పట్టదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ సంబంధిత ఏఈఓను సంప్రదించాలన్నారు.

తొగుట(దుబ్బాక): రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు పంపిణీ చేసేందుందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో వ్యవసాయ విస్తరణాధికారి నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. 60 శాతం సబ్సిడీతో 30 కిలోల బస్తా రూ.1,116లకు అందజేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని ఆగ్రో రైతు సేవాకేంద్రాల్లో లభిస్తాయన్నారు.

భూసారం పెంపుతో అధిక దిగుబడి

కొండపాక(గజ్వేల్): భూసారం పెంపుతో అధిక దిగుబడులు పొందొచ్చని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని అన్నారు. మండల పరిధి వెలికట్ట క్రాస్ రోడ్ల ఆగ్రోస్ దుకాణంలో సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను శనివారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగ, జనుము విత్తనాలను సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగ్గురు పిల్లల నిబంధన తొలగించాలి


నిరసన తెలుపుతున్న సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించాలని ఇటిక్యాల దళిత సంఘం నాయకులు నిరసన తెలిపారు. శనివారం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1995 జీఓను రద్దు చేసి ముగ్గురు పిల్లల నిబంధనను తొలగించాలన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ ఎన్నికలకు లేని నిబంధనలు పంచాయతీ ఎన్నికల్లో పెట్టడం సరికాదన్నారు. ప్రజాసేవ చేసేందుకు ఉత్సాహం ఉన్నప్పటికీ ముగ్గురు పిల్లల నిబంధన అడ్డు వస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నిబంధనను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం దాసు, లక్ష్మణ్, బాలమల్లయ్య, మల్లేశం, రాజు, కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం అప్పలకుప్ప

పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్ రెడ్డి

దుబ్బాకటౌన్: 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రావణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. శనివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం రైతుబంధు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో సన్నకారు రైతులకే కాకుండా భూస్వాములకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రైతుబంధు వేశారన్నారు. కానీ తమ ప్రభుత్వం రైతులకే ఇస్తుందన్నారు. అవసరం లేని కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి కేసీఆర్.. ఒక్కో రైతుపై 1.25 లక్షల భారం మోపారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కట్టిన నాగార్జున సాగర్ ఇప్పటి వరకు చెక్కు చెదరలేదన్నారు. కానీ బీఆర్ఎస్ హయాంలో కట్టిన మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు ఎందుకు దెబ్బతిన్నాయని ప్రశ్నించారు. దుబ్బాకలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యల వలయంగా మారాయన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు తమ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కమలాకర్, సంజీవ రెడ్డి , భాస్కర్, రవీందర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి శివరంజని


మాట్లాడుతున్న జడ్జి శివరంజని

అక్కన్నపేట(హుస్నాబాద్): చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని హుస్నాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. మండలంలోని మోత్కులపల్లి గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మహిళలు, బాలికల రక్షణకు ఎన్ని చట్టాలున్నా తగిన అవగాహన లేకపోతే వాటిని సమర్థవంతంగా వినియోగించుకోలేరన్నారు. ఓ మహిళకు అన్యాయం జరిగితే సామూహికంగా ఖండించడంతో పాటు ఆమెకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కవికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్, న్యాయవాది కొంకటి శ్రీనివాస్, భూక్య రాజేందర్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించలేదని, నిధుల వినియోగంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శనివారం జెడ్పీసీఈఓ కార్యాలయంలో ఇద్దరు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కుంచం అశోక్, సూరగోని శేఖర్ మాట్లాడుతూ చిన్నకోడూరు మండల పరిషత్ పరిధిలో 2014 నుంచి 2024 వరకు అభివృద్ధి పనులకు మంజూరైన నిధులలో భారీగా అక్రమాలు జరిగాయన్నారు. వాటిపై విచారణ జరపాలని కోరారు. ఎంపీపీ నిధులను ఏఏ గ్రామాల్లో ఖర్చు చేశారో వాటికి సంబంధించిన తీర్మానాల ప్రతులు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా ఏడాది కిందట దరఖాస్తు చేసినా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం


రఘునందన్‌రావుతో గజ్వేల్ నాయకులు

గజ్వేల్‌రూరల్: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని గజ్వేల్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు శ్రీనివాస్, ఐలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి ఎమ్మెల్సీ పూజలు


పెద్దమ్మతల్లికి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌లోని పెద్దమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో శనివారం ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేశం, నాచారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి, సహకార సంఘం డైరెక్టర్ చాడ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆనందం, రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతులపై బీఆర్ఎస్ కపట ప్రేమ

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులపై కపట ప్రేమతో బీఆర్ఎస్ దీక్షలు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. రాష్ట్రంలో సన్నరకం ధాన్యానికి అధిక డిమాండ్ పెరగడంతో సన్న రకం ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు అదనపు రాయితీ కల్పించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన చేస్తున్నారన్నారు. నాడు కేసీఆర్ సన్నరకం సాగు చేయాలని రైతులను మోసం చేసిన సంగతి రైతులు మరచిపోరన్నారు. బీఆర్ఎస్ నాయకులు తమ ఉనికి కాపాడు కోవడానికి మాత్రమే ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు గణేష్, పర్శరాములు, జయంత్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

◆ తొలివిడత దరఖాస్తుల స్వీకరణ

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ట్రేడ్లలో రెండేళ్ల కాల వ్యవధిగల కోర్సులు బోధిస్తున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి టాటా గ్రూపు సౌజన్యంతో కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ శివాజీ విగ్రహం ఆవిష్కరణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెంలో ఆరె క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శనివారం ఆ సంఘం నాయకుడు కుసుంబ బుచ్చయ్య ఆవిష్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరె క్షత్రియ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ సద్వినియోగం చేసుకోండి

గజ్వేల్‌రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల సేవాధికార సంస్థ చైర్మన్ బి.ప్రియాంక అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ జూన్ 8న గజ్వేల్ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

అక్కన్నపేట(హుస్నాబాద్): శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి 331వ ఆరాధన మండలంలోని కేశవాపూర్, రేగొండ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. స్వామివారు సజీవ సమాధి నిష్ఠ వహించి 331 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.